క్లుప్తంగా

రొంపివలస విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, నిర్వాహకులు

పాతపట్నం: మండలంలోని రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇండాస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రతిభ పరీక్షలో ఆ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని హెచ్ఎం ఎన్.కుమారస్వామి తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ప్రతిభ పరీక్షకు వివిధ పాఠశాలలకు చెందిన 160 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో రొంపివలస హైస్కూల్‌కు చెందిన అభినయ్ మొదటి స్థానం, చాందిని ద్వితీయస్థానం, మిన్నారావు 5వ స్థానం సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఇండాస్ నిర్వాహకులు హేమసుందర్, రమణ, ఈశ్వరరావులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ఉపనయనాలు



ఉపనయనాలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయంలో వైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక ఉపనయనాలు భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 44 మంది వైశ్యులకు శాస్త్రోక్తంగా సుబ్రహ్మణ్య శాస్త్రి ఉపనయనాలు చేయించారు. కార్యక్రమంలో వైశ్య సంఘం ప్రతినిధులు తంగుడు జోగారావు, జామి వెంకటరావు, ఊణ్ణ రంగనాథ్, నాగేశ్వరరావు, టంకాల అర్జున్, పాట్నూరు సోమేశ్వర గుప్త తదితరులు పాల్గొన్నారు.

పిల్లర్ ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పాతపట్నం: పట్టణంలోని నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం వద్ద 326–ఏ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రైల్వే ఫ్లై ఓవర్ పనులు జరుగుతున్నాయి. అందువలన ఆలయం ముందు పిల్లర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావుతో కలిసి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులకు వినతిపత్రం ఆదివారం అందజేశారు. పిల్లర్ ఏర్పాటు చేయకపోతే ఫ్లై ఓవర్ వలన ఆలయ ముందరి భాగం కనిపించదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నీలమణి దుర్గ ఆలయ మాజీ చైర్మన్ అక్కంధ్ర సన్యాసిరావు, సైలాడ సతీష్, చిన్నయ్య, జన్నామహంతి, రమేష్, తడక లోకేష్, గోరిశెట్టి దుర్గారావు, రమణయ్య, కరకవలస మన్మథరావు, దాసరి రమణ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లకూరి శాంతారాం మృతి



పొందూరు: ప్రముఖ సంఘ సంస్కర్త, స్థానిక యంగ్ స్టార్ యూత్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాళ్లకూరి శాంతారాం (70) ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. పొందూరు, జి.సిగడాం, లావేరు, ఎచ్చెర్ల మండలాల్లో శాంతారాం మాస్టారు సుపరిచితులు. సంఘ సంస్కర్తగానే కాకుండా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధిగా, పొందూరు పైడితల్లి అమ్మవారి ట్రస్టు వ్యవస్థాపక సభ్యుడిగా సేవలు అందించారు. రాత్రిబడులు ప్రారంభం కాకముందే పొందూరులో కార్మికులకు అక్షరాలు నేర్పి ఎంతోమందిని తీర్చిదిద్దారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర సభ్యుడిగా సేవా కార్యక్రమాలను, రక్తదాన శిబిరాలను నిర్వహించి గుర్తింపు పొందారు. కాగా రెడ్‌క్రాస్ వైద్యుల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు.

ప్రణాళికతో చదవాలి



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

నరసన్నపేట: పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులు ప్రణాళికతో చదవాలని పద్మావతి విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ సూచించారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో కోదూరు, జలుమూరు ఎస్సీ వసతి గృహాల పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక అవగాహన తరగతులు ఆదివారం నిర్వహించారు. పరీక్షల్లో ఒత్తిడిని దూరం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నరసన్నపేట బాలికల వసతి గృహ మేట్రిన్ సూర్యప్రభ, కోదూరు, జలుమూరు హెచ్‌డబ్ల్యూవోలు సత్యనారాయణ, పి.మాధవి, నిమ్మాడ వార్డెన్ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు..

ఇంకెంత దూరం..!

- మాటలకే పరిమితమవుతున్న హామీ
- పట్టించుకోని ప్రభుత్వం
- మోసపోయామని మహిళల ఆవేదన



హిరమండలం: అధికారంలోకి రావడానికి అలవికాని హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, అధికారంలోకి వచ్చాక వాటిని పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో సూపర్–6 హామీలంటూ పెద్ద ఎత్తున కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక వాటి ఊసెత్తడం మానేశారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విషయంలో దసరా, సంక్రాంతి అంటూ రోజుకొక మాట చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వంపై మహిళలు విమర్శలు చేస్తున్నారు. జిల్లాలో అధికంగా గ్రామీణ ప్రాంతాలు ఉన్నాయి. ప్రజలు వివిధ పనులు, కాలేజీలు, ఆస్పత్రులు, చిరు వ్యాపారాలు చేసుకోవడానికి నిత్యం మండల కేంద్రాలకు వెళ్తుంటారు. ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఇచ్చిన హామీని ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేయాలని కోరుతున్నారు.

పండగల పేరుతో కాలయాపన

హామీ అమలుకు పండగల పేరుతో కూటమి నాయకులు కాలయాపన చేస్తున్నారని మహిళలు విమర్శిస్తున్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ కప్పదాటు ప్రయత్నాలు చేస్తున్నారని దుమ్మెత్తిపోస్తున్నారు. పండగలు వెళ్తున్నా ప్రయాణంపై స్పష్టమైన ప్రకటన చేయడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఇచ్చినమాట ప్రకారం హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓట్ల కోసమే హామీ

జిల్లావ్యాప్తంగా 18,75,934 మంది ఓటర్లు ఉండగా, అందులో మహిళా ఓటర్లు 9,45,945 మంది ఉన్నారు. దీంతో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు కూటమి నాయకులు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని హామీ ఇచ్చారని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారంలోకి వచ్చాక హామీల అమలును పట్టించుకోవడం మానేశారని వాపోతున్నారు.

మహిళలు మోసపోయారు



ఎన్నికల ముందు హామీలు ఇచ్చే సమయంలోనే ఆచరణ సాధ్యమా లేదా అనేది రాజకీయ నాయకులు ఆలోచించాలి. ఎన్నికల్లో గెలిచిన తర్వాత హామీల అమలుపై భయమేస్తోందని చెప్పడం సిగ్గుచేటు. హామీలు ఇచ్చేటప్పుడు సీఎం చంద్రబాబుకు భయం అనిపించలేదా. కూటమికి ఓట్లు వేసిన మహిళలు మోసపోయారు.

– రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం

మాట నిలబెట్టుకోవాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదు. ఎప్పుడు అమలు చేస్తారో కూడా తెలియడం లేదు. పొరుగు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా ప్రభుత్వాలు అమలు చేశాయి. ఇక్కడ ఎందుకు అమలు చేయలేకపోతున్నారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా అమలు చేసి మాట నిలబెట్టుకోవాలి.

– మీసాల రజినీ, ఎంపీటీసీ సభ్యురాలు, హిరమండలం

నమ్మక ద్రోహమే



కూటమి నేతల మాటలు నమ్మి మహిళలు ఓట్లు వేశారు. ఇప్పుడు ప్రభుత్వం హామీ అమలు చేయకుండా జాప్యం చేస్తోంది. అమలు చేస్తారన్న నమ్మకం కూడా కనిపించడం లేదు. ఉచిత బస్సు ప్రయాణంపై స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. నమ్మిన వారికి ద్రోహం చేయడం సరికాదు. మహిళలకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలి.

– వంగపల్లి సావిత్రి, వైస్ ఎంపీపీ, హిరమండలం

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న కార్మిక నాయకుడు బలరాం

ఆమదాలవలస: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐజే నాయుడు కాలనీలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి దళారీ వ్యవస్థ తీసుకురావాలని చూస్తోందన్నారు. ఇది కార్మికుల భద్రతకు ప్రమాదమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అలాగే జాతీయ సెలవులను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరూ దశలవారీగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ కార్మికుల యూనియన్ లీడర్ తాడి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచకపోవడంతో కార్మికులపై పని భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సంఘం నాయకులు ఎం.రాజేష్, కె.రాజు, కె.గోవింద, ఎస్.రమ, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన సాగు విస్తీర్ణం



సాగుచేస్తున్న కర్బూజ పంట

ఎల్.ఎన్.పేట: మండలంలో ఈ ఏడాది కర్బూజ సాగు విస్తీర్ణం ఘననీయంగా తగ్గిపోయింది. గత రెండు మూడు సంవత్సరాలతో పోల్చితే ఈ ఏడాది సగం విస్తీర్ణంలో కూడా సాగు జరగడం లేదని రైతులు చెబుతున్నారు. ఇదివరకు మండలంలో సుమారు 120 ఎకరాల వరకు సాగు జరిగేది. అయితే ఈ ఏడాది 50 ఎకరాల్లో కూడా సాగు చేయడం లేదని అంటున్నారు. సుమంతాపురం, బరటాం, గడేవానిపేట, దబ్బపాడు, శ్యామలాపురం గ్రామాల్లో ఈ పంట అధికంగా పండిస్తారు. అయితే ఈ ఏడాది దబ్బపాడు, శ్యామలాపురం గ్రామాల్లో పూర్తిగా సాగు చేయడం లేదు. మిగిలిన గ్రామాల్లోనూ సగం మంది రైతులు సాగుకు దూరమైయ్యారు. బరటాం, సుమంతాపురం, గడేవానిపేట గ్రామాలకు చెందిన రైతులు వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా విడిచిపెట్టే నీటి ఆధారంగా సాగు చేస్తారు. కానీ కాలువ ద్వారా సాగునీరు విడిచిపెట్టే అవకాశాలు లేవని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించడంతో సాగు విరమించుకున్నట్లు రైతులు తెలిపారు. సాగునీటి చెరువుల దగ్గరలో ఉన్న రైతులు కొద్దిపాటి విస్తీర్ణంలో సాగు చేస్తున్నప్పటికీ, దిగుబడులు అంతంతమాత్రంగానే ఉంటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న దట్టమైన మంచు ప్రభావంతో పూత మాడిపోయి పిందెలు రావడం లేదని వాపోతున్నారు.

ఘనంగా రాజులమ్మ జాతర



ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

పొందూరు రూరల్: మండలంలోని దళ్లవలస గ్రామంలో భక్తిశ్రద్ధలతో రాజులమ్మ జాతర ఆదివారం నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ వి.సత్యనారాయణ ఏర్పాట్లు చేశారు. జాతరను సర్పంచ్ కిల్లాన జ్యోతి, ఎంపీటీసీ కిల్లాన సూర్యారావులు పర్యవేక్షించారు.



జాతరలో పాల్గొన్న ప్రజలు

విజయ గౌరిని గెలిపించండి



ఆమదాలవలస రూరల్: కనుగులవలసలో ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆమదాలవలస రూరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.విజయ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని యూటీఎఫ్ సీనియర్ నాయకుడు బొడ్డేపల్లి జనార్ధనరావు కోరారు. ఈ మేరకు మండలంలోని కనుగలవలస గ్రామంలో ఉపాధ్యాయ ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఆదివారం ప్రచారం చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై నిత్యం పోరాటం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా కార్యదర్శి టి.భాస్కరరావు, మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని పాపారావు, జిల్లా మాజీ కార్యదర్శి కింతలి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: రానున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.విజయగౌరికి మద్దతు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన్య కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఆర్.దమయంతిలు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కావాలంటే ఆమె గెలవాల్సిన అవసరం ఉందన్నారు.

రఘువర్మను గెలిపించండి



మెట్టక్కివలసలో ప్రచారం చేస్తున్న మాలిక్ తదితరులు

ఆమదాలవలస: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మను గెలిపించాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీ విభాగ కార్యదర్శి ఎస్.ఎ.మాలిక్ కోరారు. పట్టణంలోని 11వ వార్డు మెట్టక్కివలస తదితర ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఓటర్లుగా ఉన్న ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి రఘువర్మను మళ్లీ ఎమ్మెల్సీగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేశారు.

జంగిల్ క్లియరెన్స్



జేసీబీతో మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: మండలంలోని బొబ్బిలిపేట నుంచి లక్ష్మడుపేట వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలను ఆదివారం తొలగించారు. పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించేవి కావు. దీంతో ప్రమాదాలు జరగకుండా సర్పంచ్ రమణమూర్తి రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను జేసీబీతో తొలగించేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో నాయకుడు చింతాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సారవకోట: మండలంలోని గోపాలపురం గ్రామానికి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన ముచ్చా ప్రసాద్ తీవ్ర గాయాలపాలైయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ద్విచక్ర వాహనంపై బద్రి నుంచి గోపాలపురం వస్తున్న ముచ్చా ప్రసాద్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో కాలివేళ్లు తెగిపోయాయి. దీంతో తొలుత సారవకోట పీహెచ్‌సీకి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అక్కడి నుంచి నరసన్నపేట ఆస్పత్రికి తరలించారు. గాయపడిన ముచ్చా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ శ్రీనివాసరావు ఆదివారం కేసు నమోదు చేశారు.

బుడితిలో ఆధ్యాత్మిక సత్సంగం



ఆధ్యాత్మిక సత్సంగంలో మాట్లాడుతున్న వక్తలు

సారవకోట: మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్య జీవన సమాజం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సత్సంగం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మఠంకు చెందిన నికేతన్ స్వామి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నరసింహస్వామి, అల్లు రామయ్య, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ట



కమిటీ సభ్యులతో కలిసి పూజల్లో పాల్గొన్న మామిడి శ్రీకాంత్

పాతపట్నం: మండలంలోని గంగువాడ పంచాయతీ బడ్డుమర్రి గోపాలపురం గ్రామంలో పంచముఖ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ట ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు గంగువాడ, బడ్డుమర్రి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో..!



ఈ చిత్రంలో కనిపిస్తున్నది కొత్తూరు మండలం బలద గ్రామంలో ఉన్న పద్మనాభం సాగరం. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ఆయకట్టు చెరువు పాలకుల నిర్లక్ష్యానికి గురయ్యింది. దీంతో చెరువులో దట్టంగా గడ్డితో పాటు పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఫలితంగా ఏడాదికేడాది ఆయకట్టు భూములకు సాగునీరు అందించే సామర్థ్యం తగ్గుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

– కొత్తూరు

బోరు బాగు చేయరూ..?



ఎల్.ఎన్.పేట మండలంలోని బొత్తాడసింగి గ్రామంలో ఉన్న బోరు బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత కొన్ని నెలలుగా బోరు పనిచేయడం లేదన్నారు. వేసవికాలం సమీపిస్తుండడంతో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

– ఎల్.ఎన్.పేట

సంత.. సమస్యల చింత



ఆమదాలవలస మున్సిపాలిటీ 7వ వార్డు చింతాడ గ్రామంలో ప్రతీ శనివారం జరిగే వారపు సంతలో సమస్యలతో వ్యాపారులు సతమతమవుతున్నారు. ఏటా మున్సిపాలిటీకి రూ.లక్షల్లో ఆదాయాన్నిచ్చే సంతలో వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో నిత్యం ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుబయట వేసుకున్న దుకాణాలకు కూడా ఆశీల వసూళ్లు భారీగా చేస్తున్నారని వాపోతున్నారు. కనీసం పశువులు నీరు తాగేందుకు కుండీలు కూడా ఏర్పాటు చేయడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, చింతాడ గ్రామ పెద్దలు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

– ఆమదాలవలస

ప్రయాణం.. ప్రమాదకరం





ప్రయాణాల్లో నిర్లక్ష్యంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా కొంతమంది పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధిక లోడ్‌తో ప్రయాణిస్తూ తాము ప్రమాదంలో పడడమే కాకుండా, ఇతరులు ఇబ్బంది పడేలా వ్యవహరిస్తున్నారు. ఎల్.ఎన్.పేటలో ఆదివారం ఉదయం కనిపించిన దృశ్యాలు ఇవి. దీనివలన చిన్నపాటి ప్రమాదం జరిగినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– ఎల్.ఎన్.పేట

జగనన్న కాలనీలో గృహ ప్రవేశం



గృహ ప్రవేశంలో పాల్గొన్న కృష్ణ చైతన్య తదితరులు

నరసన్నపేట: మండలంలోని జమ్ము పంచాయతీ పరిధి గడ్డెయ్యపేట వద్ద జగనన్న కాలనీలో అడగపోలు కామేష్ నిర్మించుకున్న కొత్త ఇంట్లో ఆదివారం గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విలువైన కాలనీ స్థలం ఇచ్చారని, ఇంటి నిర్మాణానికి లోను కూడా ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో పోలాకీ జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ బాబ్జీ, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, ముద్దాడ బైరాగినాయుడు, కేసీహెచ్‌బీ గుప్త, బొబ్బాది ఈశ్వరరావు, నేతింటి సింహాచలం, ఎంపీటీసీ నేతింటి రాజేశ్వరరావు, వార్డు సభ్యులు బీఎల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

బూర్జ: గ్రామాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని తమ్మినాయుడుపేట సర్పంచ్ మూడడ్ల సుదీప్ష ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పంచాయతీ పరిధిలోని ప్రకృతి సిద్ధమైన సహజ వనరులు కొండలు, గుట్టలు (క్వారీల రూపంలో) పూర్తిగా తరలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.